క్లుప్తంగా

668 పొగాకు బేళ్ల కొనుగోళ్లు

ఒంగోలు రూరల్: స్థానిక పొగాకు వేలం కేంద్రం–2లో శనివారం పొగాకు చూర కొనుగోళ్లు జరిగాయి. వేలం కేంద్రానికి 781 బేళ్లు రాగా, 668 బేళ్లను వ్యాపారులు కొనుగోలు చేశారు. 96 బేళ్లను నోబిడ్‌గా నిర్ధారించారు. కేజీ గరిష్ట ధర రూ.162 పలకగా, కనిష్ట ధర రూ.60 పలికింది. సరాసరి ధర రూ.104.89గా నమోదైనట్లు వేలం నిర్వహణ అధికారి కె.రామకృష్ణ తెలిపారు.

బైకు అదుపుతప్పి వ్యక్తికి గాయాలు

ముండ్లమూరు: మండలంలోని బృందావనం వద్ద ద్విచక్ర వాహనం అదుపుతప్పి ఒకరికి గాయాలయ్యాయి. మండలంలోని పెద ఉల్లగల్లు గ్రామానికి చెందిన జిల్లెలమూడి చౌదరి శనివారం సాయంత్రం ద్విచక్ర వాహనంపై దర్శిలో పనులు ముగించుకొని తిరిగి ఇంటికి బయల్దేరాడు. మార్గంమధ్యలో దర్శి–అద్దంకి ప్రధాన రహదారిలో బృందావనం వద్ద అదుపుతప్పి ద్విచక్ర వాహనం గేదెను ఢీకొట్టింది. ప్రమాదంలో చౌదరికి గాయాలయ్యాయి. అటుగా వెళ్తున్న కొందరు గమనించి 108కి ఫోన్ చేశారు. 108 సిబ్బంది యోహాన్, వెంకటప్పయ్యలు అక్కడికి చేరుకొని ప్రథమ చికిత్స చేసి దర్శి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం ఒంగోలు తీసుకెళ్లారు.

ఘనంగా నాగార్పమ్మ వారి కొలుపులు

బల్లికురవ: మండలంలోని సోమవరప్పాడు గ్రామంలో కొండవర్ధువారి ఇలవేల్పు నాగార్పమ్మ కొలుపులు వైభవంగా జరుగుతున్నాయి. బుధవారం అమ్మవారి ఉత్సవ విగ్రహాలను అమరావతి సముద్రస్నానాకి తీసుకెళ్లారు. గురు, శుక్ర, శనివారాల్లో మాతుడుపు, పుట్ట బంగారం, బొల్లావులు, వీరతాళ్లతో గ్రామోత్సతం నిర్వహించారు. స్థానిక ప్రాథమిక పాఠశాల పక్కనే ఉన్న నాగార్పమ్మ ఆలయాన్ని విద్యుత్ దీపాలతో ప్రత్యేకంగా అలంకరించారు. పల్నాడు, గుంటూరు, బాపట్ల, జిల్లాలోని కొండవర్ధ కుటుంబ సభ్యులంతా కొలుపులకు రావడంతో ప్రతి ఇంటా పండుగ వాతావరణం నెలకొంది. ఆదివారంతో కొలుపులు ముగించి రాత్రికి అన్నదానం చేస్తున్నట్లు ఆలయ కమిటీ తెలిపారు.

రేపు అభయాంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ట

చినగంజాం: మండలంలోని రాజుబంగారుపాలెం పంచాయతీ కుక్కలవారిపాలెం గ్రామంలో 12వ తేదీ సోమవారం ఉదయం 7.28 గంటలకు అభయాంజనేయస్వామి ప్రతిష్ట నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఇందులో భాగంగా శనివారం సాయంత్రం పూజా కార్యక్రమాలతో కార్యక్రమాలను ప్రారంభించారు. 11వ తేదీ ఆదివారం పూజ, 12న విగ్రహ ప్రతిష్ట, అన్నదాన కార్యక్రమం నిర్వహించనున్నారు. కార్యక్రమాలు శ్రీమాన్ పరాశం భోగ శ్రీనివాస మారుతి వరప్రసాద్ భట్టాచార్యులు ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు తెలిపారు.

మద్యం బాటిళ్లు స్వాధీనం

యర్రగొండపాలెం: స్థానిక పుల్లలచెరువు రోడ్డులో అక్రమంగా మద్యం అమ్మకాలు జరుపుతున్న నిందితుడిని ఎస్ఈబీ అధికారులు శనివారం అరెస్టు చేశారు. తమకు అందిన సమాచారం మేరకు దాడులు నిర్వహించామని, ఈ దాడుల్లో కంచర్ల కేశవులు నుంచి 42 క్వార్టర్ బాటిళ్లు స్వాధీనం చేసుకొని అతడిని అరెస్ట్ చేశామని ఎస్ఈబీ ఇన్‌చార్జి సీఐ పద్మజ తెలిపారు. దాడుల్లో డీటీఎఫ్ కానిస్టేబుళ్లు ఎం.బాలరంగయ్య, వై.చంద్రశేఖర్ పాల్గొన్నారు.

నేడు వైద్య శిబిరం

గిద్దలూరు రూరల్: పట్టణంలోని విశ్వభారతి స్కూల్ ఆవరణలో డాక్టర్ బ్రహ్మానందరెడ్డి వైద్యశాల, కిమ్స్ వైద్యశాల ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం 8 గంటలకు మెగా వైద్య శిబిరం ఏర్పాటు చేయనున్నట్లు డాక్టర్ బ్రహ్మానందరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. వైద్యంతో పాటు మందులు, ఆపరేషన్లు ఉచితంగా చేయనున్నట్లు చెప్పారు. భోజన వసతి కూడా ఉంటుందన్నారు.

30 హెక్టార్లలో జామాయిల్ తోట దగ్ధం



తగలబడుతున్న జామాయిల్ చెట్లు

గుడ్లూరు: మంటలంటుకొని అటవీ శాఖ భూముల్లోని జామాయిల్ చెట్లు దగ్ధమయ్యాయి. ఈ సంఘటన గుడ్లూరు.తెట్టు ప్రధానరహదారిలో శనివారం జరిగింది. గుడ్లూరు దాటిన తరువాత రహదారి పక్కన ఉన్న చెత్తకుప్పలకు నిప్పు అంటించడంతో గాలుల దాటికి మంటలు వ్యాపించి పక్కనే అటవీ భూముల్లో సాగులో ఉన్న జామాయిల్ చెట్లకు అంటుకున్నాయి. మంటలు వేగంగా వ్యాపించడంతో 30 హెక్టార్లలో చెట్లు దగ్ధమయ్యాయి. సమాచారం అందుకున్న కందుకూరు అగ్నిమాపక సిబ్బంది సంఘటనా స్థలికి చేరుకొని మంటలను అదుపు చేశారు. సుమారు రూ.6 లక్షల నష్టం వాటిల్లి ఉంటుందని అగ్నిమాపక సిబ్బంది తెలిపారు.

నాడు వెలవెల.. నేడు కళకళ..!

- నాడు–నేడు కార్యక్రమం ద్వారా పూర్తిగా మారిన ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు
- కార్పొరేట్ స్కూళ్లను తలదన్నేలా వసతులు, చదువులు
- గత టీడీపీ పాలనలో కళావిహీనంగా మారి మూతబడిన పాఠశాలలు
- ప్రస్తుతం ఎంతో సుందరంగా అధిక సంఖ్యలో విద్యార్థులతో కళకళ
- ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి రుణపడి ఉంటామంటున్న విద్యార్థులు, తల్లిదండ్రులు



నాడు-నేడు ద్వారా అభివృద్ధి చేసిన గుండ్లాపల్లి ప్రభుత్వ పాఠశాల

మద్దిపాడు: చదువులు మాత్రమే సమాజంలో గౌరవాన్ని పెంచుతాయని, అసమానతలు తొలగిస్తాయన్న ఉద్దేశంతో పేద విద్యార్థులందరికీ మెరుగైన వసతులతో నాణ్యమైన విద్య అందించేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నడుం బిగించారు. అందుకోసం ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రభుత్వ పాఠశాలల్లో నాడు–నేడు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ధనికులకు మాత్రమే అందుబాటులో ఉండే కార్పొరేట్ స్కూళ్ల స్థాయిలో సౌకర్యాలు కల్పించి ఇంగ్లిష్ మీడియం చదువులను పేదలకు చేరువ చేశారు. నాడు–నేడు పథకంలో భాగంగా ప్రతి పేద విద్యార్థి కార్పొరేట్ తరహాలో చదువులు చదవడానికి అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించడంతో పాటు వారికి ఉత్తమ విద్య బోధించడానికి ఉపాధ్యాయులను సైతం సిద్ధం చేశారు.

మద్దిపాడు మండలంలో రూ.5,31,84,000తో పాఠశాలల అభివృద్ధి...

మద్దిపాడు మండలంలో 7 హైస్కూళ్లు, 38 ఎంపీపీ, 3 ఎంపీయూపీ పాఠశాలలు ఉన్నాయి. వాటిలో ఫేజ్ 1 కింద 23 పాఠశాలలను ఎంపిక చేసి రూ.5,31,84,000 అంచనాలతో మౌలిక వసతులు కల్పించారు. విద్యార్థులు కూర్చోడానికి బల్లలు, గ్రీన్ బోర్డులు, ప్రతి తరగతి గదిలో ఐదు చొప్పున ఫ్యాన్లు, వెలుతురు కోసం నాలుగు వైపులా ట్యూబ్ లైట్లు.. ఇలా విద్యార్థులకు తరగతి గదిలో అవసరమైన అన్ని సదుపాయాలతో పాటు ప్రత్యేకంగా మరుగుదొడ్ల నిర్మాణాలు చేపట్టారు. వాటన్నింటినీ పూర్తి చేశారు.

రెండో దశలో రూ.4,70,95,000తో అభివృద్ధి పనులు...

రెండో దశలో మద్దిపాడు మండలంలోని 17 పాఠశాలల్లో రూ.4,70,95,000 అంచనాలతో అభివృద్ధి పనులు ప్రారంభించారు. రూ.1,74,28,000 విలువైన పనులను ఇప్పటికే పూర్తి చేశారు. మిగిలిన పనులు వివిధ దశల్లో ఉన్నాయి. కార్పొరేట్ స్థాయిని తలదన్నే విధంగా పాఠశాలలను తీర్చిదిద్దడంతో పాటు కార్పొరేట్ తరహాలో ఇంగ్లిషు మీడియంలో తరగతులు నిర్వహిస్తున్నారు. దీంతో పలువురు విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల వైపు చూస్తున్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో పెరిగిన విద్యార్థుల సంఖ్య...

గత టీడీపీ ప్రభుత్వంలో ప్రభుత్వ పాఠశాలలను పూర్తిగా నిర్లక్ష్యం చేయడంతో వెలవెలబోయాయి. కనీస వసతులు లేక విద్యా ప్రమాణాలు కూడా పడిపోయి విద్యార్థుల సంఖ్య పడిపోయింది. అప్పట్లో మద్దిపాడు మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో 4,028 మంది విద్యార్థులు చదువుతుండగా, 2022–23 సంవత్సరంలో ఆ సంఖ్య 4,755కు చేరింది. ఉదాహరణకు గుండ్లాపల్లి పాఠశాలలో గత ప్రభుత్వ హయాంలో 272 మంది విద్యార్థులు చదువుతుండగా.. నేడు 521 మంది చదువుతున్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇంగ్లిష్ మీడియం విద్య అమలు చేయడంతో పాటు పాఠశాలల్లో వసతులు మెరుగుపరచడంతో అధిక సంఖ్యలో విద్యార్థినులు ప్రభుత్వ పాఠశాలల్లో చేరారు. ఈ క్రమంలో గుండ్లాపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు బాలికల జూనియర్ కళాశాలను కూడా మంజూరు చేశారు. గత నాలుగు సంవత్సరాల వ్యవధిలో పలువురు తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రైవేటు పాఠశాలల నుంచి ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించారు. సీఎంకు, ప్రభుత్వానికి విద్యార్థులు, తల్లిదండ్రులు కృతజ్ఞతలు చెబుతున్నారు.

ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు :



విద్యార్థులకు ప్రతిరోజూ ప్రత్యేక తరగతులు నిర్వహిస్తూ వారి ఉన్నతికి ఉపాధ్యాయులు కృషి చేస్తున్నారు. ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల్లో పోటీతత్వం పెరిగి విద్యార్థులు రాణిస్తున్నారు. ఇంగ్లిష్ మీడియం పెట్టడం ద్వారా పేద విద్యార్థులకు ఇంగ్లిషు చదువులు అందుబాటులోకి వచ్చాయి. ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి తీసుకున్న సాహసోపేతమైన నిర్ణయాలను స్వాగతిస్తున్నాం.

వివేకానందరెడ్డి, విద్యార్థిని తండ్రి, గుండ్లాపల్లి

ఉపాధ్యాయులు శ్రద్ధ పెడుతున్నారు :



ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ పెట్టి అందరూ ఉత్తమ ఫలితాలు సాధించేలా చూస్తున్నారు. దానికితోడు ప్రభుత్వం తీసుకున్న నాడు–నేడు, ఇతర నిర్ణయాలు మెరుగైన ఫలితాలు అందిస్తున్నాయి. గతంలో ఎన్నడూ లేని విధంగా ప్రభుత్వ విద్యా విధానంలో సంస్కరణలు చేపట్టడం అభినందనీయం.

ఎంవీఆర్ ఆంజనేయులు, ఎంఈవో, మద్దిపాడు

మండే ఎండల్లో చల్లని దీవెనలు



లబ్ధిదారులకు ప్రభుత్వ పథకాల గురించి వివరిస్తున్న ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు, ఎంపీపీ నలమలపు అంజమ్మ కృష్ణారెడ్డి, ఇతర నాయకులు

- గడపగడపలో ప్రజలు ఆశీర్వదిస్తున్నారు
- సంతనూతలపాడు ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు
- బి.నిడమానూరు గ్రామంలో గడపగడపకు విశేష ఆదరణ

నాగులుప్పలపాడు (మద్దిపాడు): మండిపోతున్న ఎండల్లో అవ్వాతాతల చల్లని దీవెనలు ఊరటనిస్తున్నాయని సంతనూతలపాడు ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు అన్నారు. శనివారం నాగులుప్పలపాడు మండలంలోని బి.నిడమానూరు గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి గడపలో ప్రభుత్వానికి ఆశీసులు లభిస్తున్నాయన్నారు. ప్రతి గడపను ప్రభుత్వ సంక్షేమ పథకాలు తాకాయని అక్కచెల్లెమ్మలు చెబుతుండటంపై ఆనందం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డికి ప్రజల నుంచి పూర్తి మద్దతు లభిస్తోందని, అందుకే తాము భారీ మెజార్టీతో గెలవబోతున్నామని అన్నారు. ఉత్త పుత్రుడు లోకేష్ పాదయాత్ర, దత్త పుత్రుడి వారాహి యాత్రలు చేసినా ప్రయోజనం లేదని, టీడీపీ, జనసేన, ఇతర ప్రతి పక్షాలన్నీ ఏకమై పోటీ చేసినా వారికి ఘోర పరాజయం తప్పదని జోస్యం చెప్పారు. సింహం లాంటి ముఖ్యమంత్రి జగనన్న దెబ్బకు ప్రతిపక్షాలు కకావికలం కావాల్సిందే అన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ఎన్నికల వరకే పార్టీలు చూస్తారని, ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ప్రజలందరి సంక్షేమాన్ని కాంక్షిస్తూ తనకు ఓటు వేయకపోయినా సరే ప్రభుత్వ పథకానికి అర్హులైతే అందిస్తారని చెప్పారు. ప్రతి పథకాన్ని పారదర్శకంగా అమలు చేస్తూ నేరుగా అక్కచెల్లెమ్మల బ్యాంకు ఖాతాలకే డబ్బు జమ చేస్తున్నారని వివరించారు. గత ప్రభుత్వంలో జన్మభూమి కమిటీలతో అర్హులందరికీ పథకాలు వర్తించేవి కావని, ప్రస్తుతం ఎవరి ప్రమేయం లేకుండా పథకాలు అందుతున్నాయని తెలిపారు. అందుకు సహకరిస్తున్న వలంటీర్లను ఎమ్మెల్యే టీజేఆర్ అభినందించారు. ప్రభుత్వ పనితీరుపై ప్రజలు హర్షం వ్యక్తం చేస్తుంటే ఓర్వలేని పచ్చమీడియా రోజుకో కథ వండివార్చుస్తోందని మండిపడ్డారు. మేలు చేసే ప్రభుత్వం ఏదనే విషయంపై ప్రజలు స్పష్టంగా ఉన్నారని, ఎవరికి ఓటు వేయాలో నిర్ణయం తీసుకుని ఉన్నారని తెలిపారు. సొంతంగా ఏ ఎన్నికల్లోనూ పోటీచేయలేని చంద్రబాబు.. మళ్లీ తన కుయుక్తులకు తెర తీశారని, జాగ్రత్తగా ఉండాలని ప్రజలకు తెలిపారు. గ్రామంలో మంచంలో ఉన్న వృద్ధులు, నిరుపేదలు, ఆర్థికంగా చితికిపోయి పూట గడవని పరిస్థితిలో ఉన్న మహిళలకు ఎమ్మెల్యే టీజేఆర్ ఆర్థికసాయం అందించారు. ముందుగా స్థానిక తెలుగు బాప్టిస్ట్ చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం సెంటర్‌లోని దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎంపీపీ నలమలపు అంజమ్మ కృష్ణారెడ్డి, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు పోలవరపు శ్రీమన్నారాయణ, రైతు విభాగం రీజినల్ కోఆర్డినేటర్, పొగాకు బోర్డు సభ్యుడు మారెడ్డి సుబ్బారెడ్డి, ఏఎంసీ చైర్మన్ మారెళ్ల బంగారుబాబు, మాజీ చైర్మన్ ఇనగంటి పిచ్చిరెడ్డి, పార్టీ నాయకులు పులిచెర్ల పరంధామిరెడ్డి, పూర్ణచంద్రరావు, వైస్ ఎంపీపీ మల్లె జాన్సన్, బడే అంకిరెడ్డి, డాకా కృష్ణారెడ్డి, గ్రామ సర్పంచ్ వడ్డిముక్కల శ్రీనివాసరావు, ఉపసర్పంచ్ గంగ్ర రమణారెడ్డి, సొసైటీ అధ్యక్షుడు కాటా శ్రీనివాసరెడ్డి, కొమ్మూరి సుధాకర్‌బాబు, స్టేట్ డైరెక్టర్లు చెన్నకేశవులు, విజయకుమార్, మద్దిపాడు ఎంపీపీ వాకా అరుణ కోటిరెడ్డి, నాయకులు గుడ్డపాతల రవి, బెజవాడ రాము, సన్నపురెడ్డి రమణమ్మ, పలువురు నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

ఒంగోలు ఎంపీడీవో విస్తృత పర్యటన

ఒంగోలు రూరల్: మండలంలోని పలు గ్రామాల్లో ఒంగోలు ఎంపీడీవో పి.అజిత శనివారం విస్తృతంగా పర్యటించారు. అభివృద్ధి పనులు, సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, వెల్‌నెస్ సెంటర్ల నిర్మాణాలను పరిశీలించారు. యరజర్ల, దశరాజుపల్లె, చేజర్ల గ్రామాల్లోనే సచివాలయ నిర్మాణాలు పూర్తయ్యాయని, మిగిలిన గ్రామాల్లో కూడా త్వరగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. సమస్యలేమైనా ఉంటే ఆ గ్రామ సర్పంచ్‌లతో మాట్లాడి పరిష్కరించుకోవాలని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా సచివాలయ వ్యవస్థను ప్రవేశపెట్టిందని, అందులో భాగంగా రైతు భరోసా కేంద్రాలు, వెల్‌నెస్ సెంటర్లు ఏర్పాటు చేశారని, వాటన్నింటికీ శాశ్వత భవనాలు ఏర్పాటు చేసుకోవాల్సిన అవసరం ఆ గ్రామ నాయకులు, సర్పంచులపై ఉందని అన్నారు. అప్పుడే గ్రామీణ ప్రజానీకానికి మేలు జరుగుతుందని తెలిపారు. అనంతరం పలు గ్రామాల్లో పారిశుధ్యం, తాగునీటి సౌకర్యాలు, చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలు, రోడ్ల పరిస్థితిని ఎంపీడీవో పరిశీలించారు.



యరజర్లలో రికార్డులు పరిశీలిస్తున్న ఎంపీడీవో అజిత

ఇంకొల్లులో నేత్రదానం

ఇంకొల్లు (చినగంజాం): ఇంకొల్లు గ్రామానికి చెందిన కరి వెంకటరత్నం (75) శనివారం మృతి చెందడంతో ఆమె కుటుంబ సభ్యులు మృతురాలి నేత్రాలను దానం చేసేందుకు ఇంకొల్లు రోటరీ క్లబ్ అవయవదాన కమిటీకి సమాచారం అందించారు. కమిటీ సభ్యులు శంకర కంటి ఆసుపత్రి వైద్యులు డాక్టర్ శేఖర్‌తో దాత కార్నియాలను సేకరించారు. దాత కుమారులు వెంకటేశ్వర్లు, సుధాకర్, కోడళ్లు మాధురి, ఉదయలక్ష్మి, కుమార్తె రాధారాణి, అల్లుడు శ్రీనివాసరావులకు రోటరీ అవయవదాన కమిటీ సభ్యులు ఎస్ రామ్మోహనరావు, జే స్వామి, రోటరీ అధ్యక్ష, కార్యదర్శి, ట్రెజరర్‌లు భవనం అందిరెడ్డి, కరి కమలేశ్వరరావు, వంకాయలపాటి శ్రీమన్నారాయణలు ధన్యవాదాలు తెలియజేశారు.

ఈదురుగాలులకు విరిగిపడిన స్తంభాలు

చినగంజాం: మండలంలో శనివారం సాయంత్రం వీచిన ఈదురుగాలులకు విద్యుత్ స్తంభాలు విరిగిపడ్డాయి. శనివారం సాయంత్రం ఉరుములు, మెరుపులు వర్షంతో కూడిన ఈదురు గాలులు వీచాయి. మండలంలోని పలు ప్రాంతాల్లో స్తంభాలు విరిగిపోగా ఒక మోటుపల్లి పంచాయతీలో 10 స్తంభాలు నేల కొరిగాయి. దీం పాటు విద్యుత్ తీగలు కూడా తెగిపడ్డాయి. 11 కేవీ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు నేలకొరిగాయి. విద్యుత్ శాఖకు నష్టం వాటిల్లినట్లు విద్యుత్ శాఖ ఏఈ పీ ఘన నారాయణ తెలిపారు.

కన్నుల పండువగా స్వామివారి కల్యాణం



కల్యాణం నిర్వహిస్తున్న పురోహితులు

మేదరమెట్ల: కొరిశపాడు మండలంలోని మేదరమెట్ల–అద్దంకి రోడ్డులో కొలువై ఉన్న వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో స్వామివార్లకు శనివారం కల్యాణ వేడుకలు ఘనంగా జరిగాయి. దంపతులు హాజరై భూనీలా సమేత కల్యాణ వెంకటేశ్వరస్వామి కల్యాణాన్ని కనులారా వీక్షించారు. కల్యాణ వేడుకల అనంతరం కమిటీ సభ్యులు భక్తులకు తీర్థప్రసాదాలు వితరణ చేశారు.

రేపు ధ్వజస్తంభ ప్రతిష్ఠ మహోత్సవం



మైనంపాడులోని శ్రీరాముల ఆలయం

చీమకుర్తి: మండలంలోని మైనంపాడులో శ్రీరాముల ఆలయంలో ఈ నెల 12వ తేదీ ఉదయం 7.25 గంటలకు ధ్వజస్తంభ ప్రతిష్ఠ మహోత్సవాన్ని నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా శనివారం ఆలయ ప్రాంగణంలో కలశాలతో స్వామివారికి విశేష పూజలు నిర్వహించారు. అఖండ దీపారాధన, దీక్షా వరణం, శాంతి హోమాలు చేశారు. ఆదివారం ఉదయం విష్వక్సేన పూజలు, కుంభారాధన, వాస్తు హోమాలు నిర్వహిస్తారన్నారు. 12న ఉదయం నూతన జీవ ధ్వజస్తంభన కార్యక్రమాన్ని అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించనున్నట్లు తెలిపారు. మధ్యాహ్నం భక్తులకు అన్నసంతర్పణ, సాయంత్రం సీతారామస్వామి కల్యాణం, గ్రామోత్సవం నిర్వహించనున్నట్లు చెప్పారు. స్థానిక, చుట్టుపక్కల గ్రామాల భక్తులు పాల్గొనాలని కోరారు.



పూజలు చేస్తున్న ఆలయ కమిటీ నిర్వాహకులు, భక్తులు

ఘనంగా స్వాతి షాపింగ్ మాల్ బంపర్ డ్రా



లక్కీ డ్రా తీస్తున్న అతిథులు, యజమానులు

- మొదటి బహుమతిగా బంగారు వడ్డాణం గెలుచుకున్న కొప్పోలుకు చెందిన తేజస్వి
- రెండో బహుమతిగా చేతి వంకీ గెలుచుకున్న బాపట్లకు చెందిన గంగాధర్
- మూడో బహుమతిగా రెండు బంగారు గాజులు గెలుచుకున్న ఖమ్మం జిల్లా వాసి రామ్‌కిషోర్

ఒంగోలు: స్థానిక కర్నూలు రోడ్డులోని స్వాతి షాపింగ్ మాల్‌లో బంపర్‌డ్రా కార్యక్రమాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. సువర్ణకానుకల పేరుతో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. చీరాల, గుంటూరు, ఖమ్మం, నరసరావుపేట, ఒంగోలు బ్రాంచిలలో ప్రతి వెయ్యి రూపాయల కొనుగోలుపై ఒక లక్కీకూపన్‌ను కొనుగోలుదారులకు అందించారు. ఐదు బ్రాంచిల నుంచి వచ్చిన కూపన్లతో కొనుగోలుదారుల సమక్షంలో బంపర్‌డ్రా తీశారు. మొదటి ప్రైజ్ డ్రాను ఒంగోలు ట్రాఫిక్ డీఎస్పీ విక్రమ్ శ్రీనివాస్ తీశారు. ఈ డ్రాలో రూ.7.50 లక్షల విలువైన బంగారు వడ్డాణాన్ని కొప్పోలుకు చెందిన తేజస్వి కైవసం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తాము రూ.3 వేల విలువైన వస్త్రాలు కొనుగోలు చేశామని, ఇంత గొప్ప బహుమతి వస్తుందని ఊహించలేదని అన్నారు. రెండో బహుమతిని ఆర్యవైశ్య కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ కుప్పం ప్రసాద్ తీయగా, చీరాల బ్రాంచిలో కొనుగోలు చేసిన బాపట్లకు చెందిన గంగాధర్ విజేతగా నిలిచారు. ఈయన రూ.1.50 లక్షల విలువైన చేతి వంకీని గెలుచుకున్నారు. మూడో విజేతను ఆర్యవైశ్య సంఘ నాయకుడు తడవర్తి వాసు తీయగా, ఖమ్మం జిల్లా బ్రాంచిలో రూ.6 వేల విలువైన వస్త్రాలు కొనుగోలు చేసిన వై.రామ్‌కిషోర్ విజేతగా నిలిచారు. ఈయన రూ.లక్ష విలువైన రెండు చేతి బంగారు గాజులు అందుకోనున్నారు. ఈ సందర్భంగా స్వాతి షాపింగ్ మాల్ అధినేత సాత్విక్ మాట్లాడుతూ ఈ మూడు బహుమతులతో పాటు 40 రోజుల పాటు నిర్వహించిన డైలీ లక్కీడ్రాలో విజేతకు పట్టుచీర కూడా అందిస్తున్నట్లు తెలిపారు.

ఉపాస్‌లో అరుదైన శస్త్ర చికిత్స

ఒంగోలు అర్బన్: స్థానిక ఉపాస్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్‌లో హయాటస్ హెర్నియాకు సంబంధించిన అరుదైన లాప్రోస్కోపిక్ శస్త్ర చికిత్స చేసినట్లు సర్జికల్ గ్యాస్ట్రో ఎంట్రాలజిస్ట్ డాక్టర్ ఉప్పలపాటి శ్రీనివాసులు తెలిపారు. శనివారం హాస్పిటల్‌లో విలేకర్ల సమావేశం నిర్వహించి ఆ వివరాలు వెల్లడించారు. 73 ఏళ్ల సుబ్బమ్మకు 8 ఏళ్లుగా తిన్న ఆహారం రిఫ్లక్స్ అవుతూ బయటకు రావడం, విపరీతమైన దగ్గుతో బాధపడుతూ హాస్పిటల్‌కు వచ్చిందన్నారు. వైద్య పరీక్షల అనంతరం అన్నవాహికకు సంబంధించి హయాటస్ హెర్నియాగా గుర్తించి అత్యాధునిక లాపరోస్కోపిక్ పద్ధతిలో సర్జరీ చేశామన్నారు. ఎటువంటి ఇబ్బంది లేకుండా కేవలం మూడు రోజుల్లోనే కోలుకుని డిశార్జ్ అయినట్లు తెలిపారు.



వివరాలు వెల్లడిస్తున్న ఉపాస్ హాస్పిటల్ డాక్టర్లు

అమృత్‌సర్‌లో ఒంగోలు నగరపాలక మండలి

- అక్కడి సీవేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంటును సందర్శించిన వైనం



అమృత్‌సర్ నగర కమిషనర్‌ను సన్మానిస్తున్న ఒంగోలు నగర మేయర్ గంగాడ సుజాత

ఒంగోలు సబర్బన్: ఒంగోలు నగరపాలక సంస్థ పాలకమండలి విజ్ఞాన యాత్రలో భాగంగా పంజాబ్ రాష్ట్రం అమృత్‌సర్ నగరాన్ని శనివారం సందర్శించారు. ఒంగోలు నగర మేయర్ కూడా శనివారం అమృత్‌సర్ చేరుకున్నారు. అక్కడి నగరపాలక సంస్థలోని సీవేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంటును పాలకమండలి సభ్యులు సందర్శించారు. అక్కడి కార్పొరేషన్ కార్యాలయంలో సమావేశమై అక్కడ జరుగుతున్న అభివృద్ధి గురించి అమృత్‌సర్ కమిషనర్‌ను అడిగి తెలుసుకున్నారు. ఒంగోలు నగరంలో చేపట్టిన అభివృద్ధి గురించి కూడా వివరించారు. నగరాభివృద్ధికి మాజీ మంత్రి, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి అందిస్తున్న ప్రోత్సాహాన్ని కూడా మేయర్ గంగాడతో పాటు డిప్యూటీ మేయర్ వేమూరి సూర్యనారాయణ, కార్పొరేటర్లు వివరించారు. ఈ సందర్భంగా మేయర్‌ను అక్కడి అధికారులు సన్మానించగా, అమృత్‌సర్ కమిషనర్‌ను ఒంగోలు మేయర్, కార్పొరేటర్లు సన్మానించారు.

నిత్యావసరాల సరఫరాకు టెండర్ల ఆహ్వానం

చీమకుర్తి: చీమకుర్తి గరికమిట్టలోని గిరిజన బాలుర గురుకుల పాఠశాలలో విద్యార్థులకు 2023–24 విద్యా సంవత్సరానికి కూరగాయలు, కోడిగుడ్లు, చికెన్, పండ్లు, పాలు సరఫరా చేసేందుకు ఆసక్తి కలిగిన వారి నుంచి టెండర్ల ద్వారా దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ప్రవీణ్‌కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పూర్తిచేసిన టెండర్ దరఖాస్తు ఫారాలను ఈ నెల 17వ తేదీ సాయంత్రం 5 గంటల్లోపు పాఠశాలలోని టెండర్ బాక్స్‌లో ఉంచాలన్నారు. గడువు దాటిన టెండర్ దరఖాస్తులను స్వీకరించరని తెలిపారు.